సాక్షి
కాకినాడ
మంగళవారం । 7 । జనవరి । 2025



కోటసత్తెమ్మకు రూ.లక్ష విరాళం


నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి కుందేటి నిఖిల్ రంగారావు కుటుంబ సభ్యులు (హైదరాబాద్) రూ.లక్ష విరాళం సోమవారం అందజేశారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు విజయనగరానికి చెందిన చింతపల్లి ఆదిత్య, అఖల దంపతులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.లక్ష విరాళంగా అందించారు.

12,810 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సాక్షి సీనియర్ సబ్ ఎడిటర్ ప్రభాకరరావు మృతి



జ్యోతుల ప్రభాకర్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సాక్షి సీనియర్ సబ్ ఎడిటర్ జ్యోతుల ప్రభాకరరావు (59) సోమవారం మృతిచెందారు. రాజమహేంద్రవరంలోని జేఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తల వెనుక రెండు బలమైన గాయాలు కావడం, తల లోపల రక్తం అధికంగా స్రవించడంతో ఆయన కోమాలోకి వెళ్లిపోయారు. ఐసీయూలో వైద్య చికిత్సలు నిర్వహించినా పరిస్థితి విషమించడంతో ఆయన మృతిచెందారు. నాలుగు దశాబ్దాల పాటు రిపోర్టర్‌గా, డెస్క్‌లో సబ్ ఎడిటర్‌గా ప్రభాకరరావు సేవలు అందించారు. కాకినాడలో తొలుత స్థానిక పత్రిక సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో రిపోర్టర్‌గా ప్రభాకరరావు పాత్రికేయ జీవితం ఆరంభించారు. విజయవాడలో ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరంలో వార్తలో సబ్ ఎడిటర్‌గా పని చేశారు. సాక్షి ప్రారంభం నుంచి రాజమహేంద్రవరం యూనిట్‌లో ఆయన పనిచేశారు. ఆయన మొక్కల ప్రేమికుడు. తీరిక వేళల్లో మినీ నర్సరీని నడుపుతూ, అందరితో సరదాగా, స్నేహ పూర్వకంగా, ఆత్మీయంగా మెలిగేవారు. ప్రస్తుతం ఆ నర్సరీని ఆయన కుమారుడు నిర్వహిస్తున్నాడు. ఆయన భౌతికకాయాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మంగళవారం ఉదయానికి ఆ కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. అనంతరం కోటిలింగాల శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన మృతికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ సెక్రటరీ ఎం.శ్రీరామమూర్తి, ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. పాత్రికేయులందరూ ఉదయం 10 గంటలకు ప్రభుత్వాసుపత్రికి చేరుకోవాలని వారు కోరారు.


గోలి శ్యామలను అభినందించిన కలెక్టర్



గోలి శ్యామను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): విశాఖపట్నం నుంచి కాకినాడ వరకూ బంగాళాఖాతంలో వారం రోజులపాటు 150 కిలోమీటర్లు ఈది ఘనత సాధించిన సామర్లకోటకు చెందిన గోలి శ్యామలను సోమవారం కలెక్టర్ షణ్మోహన్ సగిలి సత్కరించారు. వయస్సుతో నిమిత్తం లేకుండా విశాఖలో మొదలుపెట్టి ఈదుకుంటూ విజయవంతంగా కాకినాడకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు అభినందనలు తెలియజేశారు. సముద్రాలను ఈదడం హాబీగా పెట్టుకున్న ఆమె ధైర్య సాహసాలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి



కలెక్టరేట్‌లో ప్రజలు నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీలకు ఆయా శాఖల అధికారులు సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. రెవెన్యూ, పింఛను, బియ్యం కార్డులు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికెట్ల మంజూరు వంటి అంశాలు 339 అర్జీలు అందాయన్నారు. శాఖల వారీగా అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

పోలీస్ స్పందనకు 49 ఫిర్యాదులు


కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 49 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు.



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న విక్రాంత్ పాటిల్

ఆగని వలంటీర్ల ఆందోళన

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు ఎప్పుడేమన్నారంటే..



వారితో ఎలాంటి లాభం లేదు

వలంటీర్లతో పెద్ద ప్రమాదం వచ్చి పడింది. ఒక అమ్మాయిని తమ వాంఛ తీర్చాలని బలవంతం చేశారు. ఆ అమ్మాయి ఒప్పుకోకపోవడంతో కొట్టారు. ఆమె ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తీసుకువచ్చారు. వలంటీర్లను నియమించాలని ఎవరడిగారు. వారితో ఎలాంటి లాభం లేదు.

– 2020లో

కుటుంబంలో గొడవలు పెడుతున్నారు

ఇంటింటికీ వలంటీర్లు వస్తున్నారు. రాజకీయం చేస్తున్నారు. ఇది ఇస్తాం. అది ఇస్తామని చెప్పి ఇంటి లోపలికి వచ్చి మధ్య పెడుతున్నారు. అలా చేయడానికి వారు ఎవరు, ఎందుకు వివరాలు అడుగుతున్నారు. కుటుంబంలో గొడవలుపెడుతున్నారు.

– 2023లో

వారిలో చాలా సమర్థత ఉంది

వలంటీర్లలో చాలా సమర్థత ఉంది. మేము అధికారంలోకి వస్తే వారిని ఉద్యోగాల నుంచి తీయబోం. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం. వారికిస్తున్న జీతాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం. ఆ బాధ్యత నాది.

– 2024 ఎన్నికల ప్రచారంలో

- తమను చంద్రబాబు మోసగించారని ఆగ్రహం
- గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని బూటకపు హామీ
- అధికారంలోకి రాగానే పక్కన పెట్టిన వైనం
- ఏడు నెలలుగా వేతనాలు లేవు
- ఎన్నికల హామీ అమలు చేయాలని డిమాండ్



కాకినాడ కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపట్టిన వలంటీర్లు

కాకినాడ సిటీ: చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టి విధులకు దూరంగా ఉంచడం తగదని, తమను వెంటనే విధుల్లోకి తీసుకొని సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వలంటీర్లకు ఇచ్చిన రూ.10 వేల వేతనం హామీని అమలు చేయాలంటూ వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజకీయాలకు తమకు సంబంధం ఏంటని వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున నియమించి నెలకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇచ్చి విధుల్లోకి తీసుకుందన్నారు. విద్యార్హత పదో తరగతి అని చెప్పినా భవిష్యత్తులో తమకు ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఆశతో డిగ్రీ, పీజీ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్నా తాము విధుల్లో చేరామని వలంటీర్లు చెబుతున్నారు. తమను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిందనే ఒకే ఒక కారణంతో గత ఏడు నెలల నుంచి విధులకు దూరం పెట్టి కనీసం ఇచ్చే రూ.5 వేల వేతనాలు కూడా ఇవ్వకపోవడంపై వలంటీర్లు మండిపడుతున్నారు. అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు మా వేతనాలను నెలకు రూ.10 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చారని, కానీ నేడు ఇచ్చే రూ.5 వేలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్‌గా కొనసాగించడం కుదరకపోతే ఇతర శాఖల్లోనైనా తమ అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రజా సేవకు వలంటీర్ వ్యవస్థను దూరం చేయడంతో ప్రజలకు 2014 నాటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సామాజిక పింఛన్లు మాత్రమే సవ్యంగా అందుతున్నాయి. మిగతా పనుల కోసం ప్రజలు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి పనికీ ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే నేరుగా ప్రభుత్వ సేవలందేవి. ఇప్పుడా పరిస్థితి లేదని వాపోతున్నారు.

జిల్లాలో వలంటీర్లు

గ్రామ సచివాలయాలు 445	వలంటీర్లు 9,015
వార్డు సచివాలయాలు 175	వలంటీర్లు 3,257
మొత్తం 620	12,272

భవిష్యత్తు అగమ్య గోచరం

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. వలంటీర్ల వ్యవస్థ గడువు ముగిసినా కొనసాగింపునకు సంబంధించి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీరిని గాలికి వదిలేశారు. మంత్రి లోకేశ్ వలంటీర్లను కొనసాగించలేమని స్పష్టం చేయడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ అప్పగించడం ద్వారా ఇప్పటికే సర్కారు వారిని సేవలకు దూరం చేసింది. కుల,మత, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా పేదల చెంతకే ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 గృహాలకు, పట్టణ ప్రాంతాల్లో 75 నుంచి 100 గృహాలకు ఒక వలంటీర్ చొప్పున వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించింది. జిల్లాలో పట్టణ, మండలాల పరిధిలోని 620 సచివాలయాల్లో 12,272 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగావకాశం కలిగిందని ఆనందంతో సేవలు చేశారు. వలంటీర్‌కు నెలకు రూ. 5 వేల వేతనంతో తమ పరిధిలోని కుటుంబాల వారికి సంక్షేమ పథకాలను చేరవేయడం, అవసరమైన సర్టిఫికెట్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటి సేవలతో పాటు, కోవిడ్ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. ప్రభుత్వం ద్వారా కోవిడ్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విషం చిమ్మి.. ఆనక కొనసాగిస్తామని హామీ

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచి టీడీపీ, జనసేన అగ్రనాయకత్వం విషం చిమ్ముతూనే వచ్చింది. గోనె సంచులు మోసే ఉద్యోగాలు, ఇళ్లలో మగవాళ్లు లేనప్పుడు తలుపులు కొట్టి కొంపలు కూలుస్తున్నారంటూ వలంటీర్లపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తే, రాష్ట్రంలో మహిళల మిస్సింగ్‌కు వలంటీర్లే కారణమంటూ పవన్‌కల్యాణ్ విషం కక్కారు. ఎన్నికలు వచ్చేసరికి వారిని ఆకట్టుకునేందుకు మాట మార్చారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలోనూ రూ.10 వేలకు గౌరవ వేతనం పెంచుతామని చేర్చి వలంటీర్లను మోసం చేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మళ్లీ మొదలైన ప్రజలకు కష్టాలు

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసిన వలంటీర్ వ్యవస్థకు వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక 2023లో చంద్రబాబునాయుడు బహిరంగగా చౌకబారు విమర్శలు చేశారు. ఆ తర్వాత మాట మార్చి వలంటీర్ వ్యవస్థ చాలా సమర్థవంతంగా పని చేస్తోందని, కూటమి అధికారంలోకి వస్తే రూ. 5 వేల నుంచి రూ.10 వేలకు గౌరవ వేతనం పెంచుతామని చెప్పి మోసం చేశారు. గతంలో వలంటీరే నేరుగా ఇంటికి వచ్చి ప్రజలకు అవసరమైన పనులు చేసి పెట్టేవారు. ఇప్పుడు సచివాలయాలకు లేదా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామాల్లో చాలామంది నిరక్షరాస్యులు కావడం వల్ల ఇతరులపై ఆధారపడి, వారికి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు



వలంటీర్లకు గత ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం విధుల్లోకి తీసుకోకుండా మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. కనీసం గతంలో ఇచ్చిన రూ. 5 వేలు గౌరవ వేతనం అయినా చెల్లిస్తే మా కుటుంబాలకు అసరాగా ఉంటుంది. రాజకీయాల కోసం మమ్మల్ని పక్కన బెట్టడం ఎంత వరకు సమంజసం?.

సతీష్, వలంటీర్, తాళ్లరేవు

సేవలకు దూరంగా ఉంచుతున్నారు



గతంలో వలంటీర్లుగా మేము ప్రతి నెలా ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్‌లను అందించే వాళ్లం. ప్రజలకు అన్ని ప్రభుత్వ పథకాలను అందేలా చూసేవారం. అలాంటి మమ్మల్ని విధులకు దూరం పెడుతుంటే బాధగా ఉంటుంది. తక్షణం మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి.

ఏ ప్రకాష్, వలంటీర్, గొల్లప్రోలు

70 శాతం మంది మహిళలే



కాకినాడ జిల్లాలో పని చేసే వార్డు, గ్రామ వలంటీర్లలో 70 శాతం మంది వరకు మహిళలమే ఉన్నాం. ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనం మా కుటుంబాలకు వేడి నీళ్లకు చన్నీళ్ల సాయంలా అక్కరకు వచ్చేది. ఏడు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా వేతనాన్ని మంజూరు చేసి ఆదుకోవాలి.

కె దుర్గ, కొవ్వాడ, కాకినాడ రూరల్

కక్ష సాధింపు తగదు



వలంటీర్లపై ప్రభుత్వ కక్ష సాధింపు తగదు. గ్రామ వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. గత ఏడు నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికై నా కూటమి ప్రభుత్వం వలంటీర్లపై సానుకూలంగా స్పందించాలి.

చెక్కల రాజ్‌కుమార్,
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ

టీడీపీ ఆరోపణలు అవాస్తవం

- అభివృద్ధికి కాదు అవినీతికి వ్యతిరేకం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి



మీడియాతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు

తుని: పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశామని గర్వంగా చెప్పుకునే ఘనత తమకు ఉందని తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో అభివృద్ధికి ఆటంకం కల్పిస్తున్నామని మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ చేసిన ఆరోపణలు అవాస్తమని కొట్టి పారేశారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో సీపీ సుధారాణి, కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. సుధారాణి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మర్రా సత్యవతి గుండె పోటుతో చనిపోతే నివాళులు అర్పించేందుకు కౌన్సిల్ సమావేశం వాయిదా వేశామని, అదే రోజు అధికారులు కలెక్టర్ అనుమతి ఉందని చెప్పి అన్న క్యాంటీన్ ప్రారంభించారన్నారు. కౌన్సిల్ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. తర్వాత సమావేశంలోని అజెండాలో ఆరేళ్ల క్రితం చేసిన పనులకు సంబంధించిన బిల్లులు, టెండర్ పిలవకుండా పనులు చేసి బిల్లులు పెట్టిన విషయంలో వ్యతిరేకించామన్నారు. రాజ్యాంగంలో పొందు పరిచిన నిబంధనలను అధికారులు పట్టించుకోక పోవడంపై సమావేశంలో అడిగినా సరైన సమాధానం చెప్పక పోవడంపై ప్రశ్నించామన్నారు. బెల్లపు వీధిలో కల్వర్టు నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం చేసిందని, పండగను దృష్టిలో పెట్టుకుని పనులను తాత్కాలికంగా వాయిదా వేశామని, అధికారులు రోడ్డును తవ్వి వదిలి వేయడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పట్టణంలో 100 సీసీ రోడ్లు, గణపతినగర్ మోడల్ పార్కు, రాజా రాజబాబు పార్కులో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేశామని, ఇది టీడీపీ నాయకులు కనిపించక పోవడం దురదృష్టకరమన్నారు.

ఎన్నికలకు ముందు ఉప్పరగూడెంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సొంత నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును తామే చేశామని చెప్పుకున్న టీడీపీని ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తోన్న కార్మికులను కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో తొలగించారన్నారు. కౌన్సిలర్లు షేక్ క్వాజా, కర్రి సత్య జగదీష్ మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో ప్రజలు అధికారులకు వినతి పత్రాలు ఇవ్వలేదా? ఇప్పుడు ఇస్తే ఎందుకు కౌన్సిల్ అజెండాలో పెడుతున్నారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజుపేట జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన పట్టాలు మున్సిపల్ కార్యాలయంలో ఉండి పోయాయని వీటిని లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదో కమిషనర్ వెంకట్రావు చెప్పాలన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదు అవినీతికి వ్యతిరేకమన్నారు. కౌన్సిలర్లు చింతల సునీత, రేలంగి విజయ దుర్గ, అల్లాడ దివాణం, ఏలూరి బాలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు



మాతంగి అమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు



రైసుమిల్లు వద్ద ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

గోపాలపురం: మండలంలోని కోమటికుంట మాతంగి అమ్మ రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించిన జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీడీ బోర్డు పాలక మండలి మాజీ సభ్యుడు మేకా శేషుబాబుకు చెందిన మాతంగమ్మ రైస్ మిల్లులో టన్నుల కొద్దీ రేషన్ బియ్యం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇదే సందర్భంలో మాతంగమ్మ రైస్ మిల్లులో భాగస్వామి అయిన కోమటికుంట గ్రామానికి చెందిన వెలగా శ్రీరామమూర్తి రైసు మిల్లులో తనకు తెలియకుండా పలు అవకతవకలకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలంటూ రైసుమిల్లు వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బకాయిదారులైన రైతులు, లారీ యజమానులు రైసు మిల్లు వద్దకు చేరుకొని బకాయిలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మేకా శేషుబాబు, వెలగా శ్రీరామమూర్తి వర్గీయులను చెదరకొట్టారు. జిల్లా విజిలెన్స్ డీఎస్పీ కె.తాతారావు, సీఐలు గోపాలకృష్ణ, వెంకటరాజు, సివిల్ సప్లై ఏఎస్‌వో రామాంజనేయులు, గోపాలపురం తహసీల్దార్ కె అజయ్‌బాబులు మిల్లులో తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యంతో వచ్చిన లారీని నిలుపుదల చేసి మాతంగమ్మ రైసుమిల్లులో నిల్వలను పరిశీలించిన అనంతరం వివరాలను జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. అర్ధరాత్రి వరకూ మిల్లులో తనిఖీలు కొనసాగాయి.

మృతుల కుటుంబాలకు కన్నబాబు పరామర్శ



మణికంఠ తల్లి భవానిని ఓదార్చుతున్న మాజీ మంత్రి కన్నబాబు

కాకినాడ రూరల్: రాజమండ్రిలో గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తూ మృతి చెందిన కాకినాడకు చెందిన మృతులు అరవపల్లి మణికంఠ, తోకాడ చరణ్‌ల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు సోమవారం పరామర్శించారు. ఈ నెల 4న రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన గేమ్ ఛేంజర్ మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు స్నేహితులతో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మణికంఠ, చరణ్ మృతి చెండడంతో రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. కాకినాడ గైగోలుపాడు రాజేశ్వరినగర్‌లోని మణికంఠ, అశోక్ నగర్ మలిపూడి వారి వీధికి చెందిన చరణ్ నివాసాలకు కన్నబాబు వెళ్లి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల్లో మణికంఠకు తండ్రి చనిపోయారని తల్లి భవాని కొడుకుని పెంచి పోషించడంతో ఇటీవల సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అయ్యాడన్నారు. స్థానికంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని, మరో మృతుడు చరణ్ తండ్రి రోడ్డు పక్కన పండ్ల దుకాణం నడుపుకొంటున్నారన్నారు. రెండు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

రాజమహేంద్రవరంలో గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకినాడ రాజేశ్వరినగర్, అశోక్‌నగర్‌కు చెందిన మృతులు అరవపల్లి మణికంఠ, తోకాడ చరణ్‌ల కు టుంబ సభ్యులను నిర్మాత దిల్ రాజు బృందం సోమవారం పరామర్శించింది. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మైత్రీ ఫిలిం డిస్ట్రిబ్యూటర్లు ఉదయ్‌రాజు, రాయుడు, మలిడి సత్యనారాయణరెడ్డి, జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్ చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొని ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సాను భూతిని తెలిపారు. జనసేన తరపున మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ.5 లక్షలను త్వరలోనే అందజేస్తామని తుమ్మలపల్లి రమేష్ తెలిపారు.

10న రత్నగిరిపై ముక్కోటి వేడుకలు



ముక్కోటి ఏకాదశి నాడు విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా దర్శనమివ్వనున్న సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు (ఫైల్)

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిన ఈ నెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున ఐదు గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఉత్తర ద్వారదర్శనం ద్వారా భక్తులను అనుమతించనున్నట్లు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. ముక్కోటి ఏర్పాట్లపై ఆయన సోమవారం దేవస్థానం వైదిక కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఆరోజు సత్యదేవుని ప్రధానాలయంలో దక్షిణ ద్వారం వద్ద ఉత్తర అభిముఖంగా మండపాన్ని ఏర్పాటు చేసి అందులో శేషపాన్పుపై పవళిస్తున్న విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లకు పంచ హారతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు.

అనంతరం ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించేందుకు భక్తులను అనుమతిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ప్రాకారంలో ఊరేగిస్తారు. రాత్రి ఏడు గంటల నుంచి వెండి గరుడ వాహనంపై గ్రామంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తారని తెలిపారు. డీసీ చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు, వైదిక కమిటీ సభ్యులు వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు, పురోహిత సంఘం అధ్యక్షుడు ఛామర్తి కన్నబాబు పాల్గొన్నారు.



రచ్చ చేసి... రేవ్ లేదంటారా!

- రేవ్ పార్టీ కేసు మాఫీకి యత్నం
- న్యూ ఇయర్ వేడుకల్లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన కూటమి నేతలు
- వారిని తప్పించేందుకు తెరవెనుక కుట్ర

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మండపేట రేవ్ పార్టీ కేసు మాఫీకి యత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. అశ్లీల నృత్యాల్లో పాల్గొన్న కూటమి నేతలను తప్పించేందుకు తెరవెనుక రాజకీయ కుట్ర జరుగుతోంది. కేసులో ఏ-1 నిందితుడిగా లే అవుట్ యజమాని కొమ్ము రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. పోలీసుల తీరును ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఖండించగా, టీడీపీ ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు సైతం సంఘటన స్థలంలో రాంబాబు లేరని చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నూతన సంవత్సర వేడుకల కోసం మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన కొంతమంది జనసేన నాయకులు భారీ లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో మండపేటలోని ఒక లేఅవుట్‌లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన విషయం విదితమే. డీజే సాంగ్స్, విద్యుత్ వెలుగుల్లో మద్యం తాగుతూ వారితో నృత్యాలు చేయించారు. మొదట అర్ధ నగ్నంగా, తర్వాత పూర్తి వివస్త్రలుగా హిజ్రాలు నృత్యం చేయడం వారితో కలసి కూటమి నాయకులు చిందులు వేయడం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో రెండు రోజుల కిందట పట్టణ పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేశారు. వీడియోల్లో మరో 15 మంది వరకూ జనసేన, టీడీపీ నాయకులను పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. వారిని తప్పించేందుకు పోలీసులపై పైస్థాయి నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. వారిని అరెస్టు చూపిస్తారో? లేక తప్పిస్తారో వేచి చూడాలి.

చెడ్డపేరు వస్తుందన్న భయంతో..

ఈ అశ్లీల నృత్యాల్లో జనసేన, టీడీపీకి చెందిన 70 మందికి పైగా హాజరైనట్టు తెలుస్తోంది. ఇందులో పలువురు మండల, జిల్లా స్థాయి ముఖ్య నేతలు ఉన్నట్టు సమాచారం. సంఘటన స్థలం పక్కనే నిర్మాణంలో ఉన్న స్లాబ్‌పైకి ఎక్కి వీరు వేడుకలు తిలకించినట్టు చెబుతున్నారు. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో రెండు పార్టీలకు చెడ్డ పేరు వస్తుందని భావించిన ఆ పార్టీల నేతలు సంఘటనతో సంబంధం లేని లేఅవుట్ యజమాని పేరిట వైఎస్సార్ సీపీ నేతను కేసులో ఇరికించడం గమనార్హం. వాస్తవానికి వైఎస్సార్ సీపీ నేత రాంబాబు ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన ఈ లేఅవుట్‌లో ఇప్పటికే చాలా వరకూ స్థలాలు అమ్ముడుపోయాయి. కొందరు తమ స్థలాల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. మరికొందరు నిర్మాణ సామగ్రిని తరలించుకుంటున్నారు. స్థల యజమానులు నిర్మాణ సామాగ్రి తెచ్చుకునేందుకు వీలుగా లే అవుట్ గేట్లు తెరిచి ఉంచుతున్నారు.



రేవ్ పార్టీలో అసభ్యకర డ్యాన్స్‌లు (ఫైల్)

ఎలా బాధ్యుడిని చేస్తారు: ఎమ్మెల్సీ తోట

రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రాంబాబు లేఅవుట్ వేసి స్థలాలు అమ్ముతుంటారని, ఆయనపై పోలీసులు ఏవిధంగా కేసు పెడతారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేత లేఅవుట్‌లో అశ్లీల నృత్యాలు జరిగాయంటూ మీడియా అడిగిన ప్రశ్నను ఆయన ఖండించారు. స్థలాలు అమ్మేసిన తర్వాత కొనుగోలు చేసుకున్న వారు తమకు నచ్చినట్టుగా వినియోగించుకుంటారని, అందుకు లేఅవుట్ యజమానిని ఏ విధంగా బాధ్యుడిని చేస్తారని ఎమ్మెల్సీ తోట మండిపడ్డారు. అధికార పార్టీ అండదండలతోనే మండపేట నడిబొడ్డున మునుపెన్నడూ లేని విధంగా ఈ అశ్లీల నృత్యాలు జరిగాయన్నారు.

రాంబాబు అక్కడ లేరు: ఎమ్మెల్యే వేగుళ్ల

సంఘటన స్థలంలో కొమ్ము రాంబాబు లేరు కాబట్టే పోలీసులు ఆయనపై ఏ-1గా కేసు నమోదు చేసినప్పటికీ, పోలీసులు ఆయన్ని ఇంకా అరెస్టు చేయలేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పడం కొసమెరుపు. తాము పోలీసులకు ఏమీ చెప్పలేదని, వారే సుమోటాగా కేసు నమోదు చేశారని ఆయన చెప్పుకొచ్చారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 - 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 - 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 - 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రొయ్యల చెరువులో పడి వ్యక్తి మృతి



ఆనంద్‌బాబు మృతదేహం

కరప: రొయ్యల చెరువులో మేత చల్లే క్రమంలో బోటులో నుంచి పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మండలం సిరిపురంలో జరిగిన ఘటన వివరాలను పోలీసులు, స్థానికులు తెలియజేశారు. జి.భావారం గ్రామానికి చెందిన అయితా అప్పల ప్రభాకర్ ఆనంద్‌బాబు (59) సిరిపురం గ్రామంలోని రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. ఆనంద్ బాబు సోమవారం పనికి వెళ్లి ఫైబర్‌బోట్‌లో కూర్చుని రొయ్యలకు మేత చల్లుతుండగా ప్రమాదవశాత్తూ బోటు తిరగబడి చెరువులో పడి మునిగిపోయాడు. పక్క చెరువులో మేత వేస్తున్న సహచర మిత్రులు బోడపాటి దుర్గాప్రసాద్, ఊబా బుల్లిరాజు వెంటనే చెరువులోకి దిగి బయటకు తీసే సరికి ఆనంద్‌బాబు మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి కువైట్‌లో పనిచేస్తోంది. ఇద్దరు కుమారులలో ఒకరు సాగర్ పోస్ట్‌మ్యాన్‌గా పనిచేస్తుండగా, మరొకరు హేమంత్ రామచంద్రపురంలో చిన్నహోటలు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఘటన వివరాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రాణం తీసిన చలిమంట

తాటాకిల్లు కాలిపోయి దివ్యాంగుడి దహనం

నల్లజర్ల: చలిమంట ఓ దివ్యాంగుడి ప్రాణం తీసింది.. ఈ ఘటన నల్లజర్లలోని కొత్తపేట ఎస్సీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. కొత్తపేట ఎస్సీ కాలనీలోని ఓ తాటాకింట్లో నామాల కృష్ణయ్య, అతని కొడుకు డానియేలు, పదిహేనేళ్ల మనవడు శ్రీనివాస్ నివాసం ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక వారు నివాసం ఉంటున్న తాటాకిల్లు అంటుకుని మంటలు ఎగసిపడటంతో గుమ్మం వద్ద నిద్రిస్తున్న కృష్ణయ్య బయటకు వచ్చాడు. లోపల నిద్రిస్తున్న డానియేలు బయటకు రావడానికి ప్రయత్నిస్తుండగా, ఇంటిపై ఉన్న సామగ్రి అతనిపై పడటంతో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతయ్యాడు. మనవడు శ్రీనివాస్ పక్కింట్లో నిద్రించడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తండ్రి కృష్ణయ్యకు వచ్చే రూ.4 వేల పెన్షన్, డానియేలుకు వచ్చే వికలాంగ పెన్షన్ రూ.6 వేలపై ఆధారపడి ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది. గ్రామస్తులు ఆలపాటి రామకృష్ణ, పల్లి సుబ్బారావు, కూరపాటి నాగరాజు తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. కాలిపోయిన మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటి పక్కన వేసిన చలిమంటే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే నెలలో గిరిజన సాంస్కృతికోత్సవం



బ్రోచర్ విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ శ్రీనివాసరావు తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతికోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించనున్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చందరప్ప, ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్ నిర్వాహకులుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

అతివేగమే ఉసురుతీసింది

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెరవలి: అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది.. మరో యువకుడిని తీవ్ర గాయాల పాల్జేసింది. జాతీయ రహదారిపై పెరవలి మండలం ఖండవల్లి శివారు బొక్కావారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పెదపూడి శక్తి గణేష్ కుమార్ (23) మృతి చెందగా, మోటార్ సైకిల్ వెనుక ఉన్న చేచేర్ల వినయ్ కుమార్ తీవ్ర గాయాల పాలయ్యారు. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. ఖండవల్లి గ్రామానికి చెందిన శక్తి గణేష్ కుమార్, వినయ్ కుమార్‌లు మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తుండగా, బొక్కావారిపాలెం వద్ద రోడ్డు మరమ్మతులు చేస్తుండడంతో ట్రాఫిక్ మళ్లించారు. అదే సమయంలో వీరు కారును తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సైన్ బోర్డును ఢీకొన్నారు. తర్వాత అక్కడే ఉన్న వంతెన రెయిలింగ్‌ను ఢీకొనడంతో శక్తి గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వినయ్ కుమార్ ఆ వేగానికి మోటార్ సైకిల్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడే ఉన్న స్థానికులు వినయ్ కుమార్‌ను హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కార్పొరేటీకరణతో విద్యావ్యవస్థ బలహీనం

- కేరళ మాజీ విద్యా శాఖ మంత్రి బేబీ
- రెండో రోజు యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



సదస్సులో పుస్తక ఆవిష్కరణ చేస్తున్న ప్రముఖులు



హాజరైన ఉపాధ్యాయులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ తత్వాలతో ప్రస్తుతం దేశంలో విద్యా విధానం బలహీనపడుతోందని కేరళ రాష్ట్ర మాజీ విద్యా శాఖ మంత్రి ఎంఏ బేబీ అన్నారు. కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం జరిగిన విద్యా సదస్సును యూటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అధ్యక్షతన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బేబీ పాల్గొనగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు నాణ్యమైన విద్య అందిస్తే పాఠశాలలు బాగుపడతాయన్నారు. విద్యా విషయంలో కేరళ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలవడానికి అదే కారణమన్నారు. ప్రతి రాష్ట్రానికి సొంత విద్యా విధానం ఉండాలన్నారు. మాతృ భాషలో పాఠశాల విద్య ఉంటేనే పిల్లలు ప్రయోజకులు అవుతారని ఆయన చెప్పారు. మాతృ భాషలో ఉపాధ్యాయులు బోధించడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుందన్నారు. సైన్స్‌లో భారతదేశం నుంచి ప్రథమంగా నోబెల్ పురస్కారం అందుకున్న సీవీ రామన్ మాతృ భాషలోనే చదువుకున్నారని గుర్తు చేశారు. ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2023 సంవత్సరంలో భారతదేశం నుంచి విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఆయా దేశాలకు చెల్లించిన రుసుము రూ.లక్షా రెండు వేల కోట్లు అన్నారు. ఇందులో రూ.42 వేల కోట్లు తెలుగు రాష్ట్రాల విద్యార్థులే చెల్లించారని ఆయన వివరించారు. ఇలాంటి సౌకర్యాలు మన దేశంలోనే ఉంటే విద్యార్థులు పొరుగు దేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. చైనాలోని ఏ ఊరికి వెళ్లినా అందమైన భవనం ఏమిటి అంటే! అది పాఠశాలేనని చెప్పారు. దేశంలో విద్యకు సంబంధించి ఒక దార్శనికత, రాజకీయ విధానం లేకపోవడం వల్లే ఇక్కడి విద్యా విధానం చతికిల పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కేరళ, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యా విధానం ఎంతో బాగుందన్నారు. అందుకే ఆ రాష్ట్రాల్లో విద్యార్థులు 70 నుంచి 80 శాతం వరకూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారని ఆయన అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న పదేళ్లలో ఆ ఏపీ ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుంటుపడుతుందన్నారు.



యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న కేరళ రాష్ట్ర మాజీ విద్యా శాఖ మంత్రి ఎంఏ బేబీ

పాఠశాల విద్య పరిరక్షణకు..

యూటీఎఫ్ ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు నడుం బిగించాలని బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. తమిళనాడు మదురై యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజమాణిక్యం మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2020 దేశంలో విద్యాభివృద్ధిని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. నూతన విద్యా విధానం విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రాలు స్వాతంత్ర విద్యా విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) జాతీయ కార్యదర్శి సీఎస్ భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయిందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు ఆయా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుడు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన చేయగలడని, అప్పుడే మంచి సమాచారం సాధ్యమన్నారు. ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులతో ఉపాధ్యాయులు, సమాజంలో ఎంతో చైతన్యం పెరుగుతుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. ఇంకా ఎన్నో పాఠశాలలు, విద్యాలయాలు సరిపడినంత బోధన సిబ్బంది లేక సతమతమవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే 117 జీవోను రద్దు చేయాలని, మూడు నాలుగు ఐదు తరగతులు ప్రాథమిక పాఠశాలల్లోనే ఉండాలని అన్నారు. భవిష్యత్ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా సంసిద్ధులు కావాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతరం సాహిత్య సదస్సు ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు నీశ్శుయన్ కుమార్‌రాజా అధ్యక్షతన నక్షత్రబాట, చెమటకెక్కిన వాక్యం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, బి.గోపిమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ ప్రసాద్, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర అన్నారాం, కుమార్ రాజా, ఎన్న అరుణ కుమారి, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరేష్, తోటకూర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యూటీఎఫ్ సాంస్కృతిక బృందం ఆలపించిన ఉద్యమ గీతాలు అందరినీ ఆహ్లాదపరిచాయి.

భార్యపై కత్తితో దాడి

గోకవరం: భార్యాభర్తల మధ్య జరిగిన వాగ్వాదం చివరకు కత్తిపోట్లకు దారితీసింది. గోకవరం ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ వీధిలో నివాసం ఉంటున్న మహిపాల వెంకటేష్, గంగాభవానీ దంపతుల మధ్య సోమవారం ఉదయం వాగ్వాదం చోటుచేసుకుంది. తీవ్ర కోపోద్రిక్తుడైన భర్త వంట గదిలోని చాకుతో గంగాభవానీని విచక్షణా రహితంగా దాడి చేశాడు. సుమారు 23 చోట్ల ఆమెకు గాయాలు కావడంతో రక్తమోడుతున్న ఆమెను చూసి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీడీపీ శ్రేణుల దాడి

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీకి గాయాలు



దాడి చేసేందుకు ఇంటి వచ్చిన టీడీపీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ అమరాధి కాశీ విశ్వనాథ్ ఇంటిపై సోమవారం టీడీపీ శ్రేణులు దాడి చేశారు. ఇందులో కాశీవిశ్వనాథ్ గాయపడగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. ఆ వివరాల్లో వెళ్తే.. సోమవారం శరభవరంలో ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ అమరాధి కాశీ విశ్వనాథ్ హాజరై ప్రసంగిస్తుండగా, ఆయన కుర్చీని టీడీపీ కార్యకర్త అమరాధి రాంబాబు తండ్రి కామరాజు తీసివేసి మాట్లాడింది చాలు ఇక ఆపు అంటూ అవహేళన చేశారు. దీంతో అర్ధాంతరంగా సభ ముగించేశారు. అక్కడ నుంచి కాశీవిశ్వనాథ్ ఇంటికి వెళ్లిపోయాడు. ఆయన ఇంటిని ఆనుకుని ఉన్న టీడీపీ నాయకుడు అమరాధి వెంకటరమణ (ఏవీ) తిరిగి విశ్వనాథ్‌తో గొడవ పెట్టుకున్నాడు. అంతటి ఆగకుండా అక్కడ నుంచి వెళ్లి టీడీపీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ అమరాధి వెంకట్రావు మరికొందరు టీడీపీ నేతలతో కలసి ఎంపీటీసీ ఇంటిపైకి వచ్చి మూకుమ్మడిగా వచ్చి నానా దుర్భాషలు ఆడుతూ దాడి చేశారు. విశ్వనాథ్ పీకను అమరాధి వెంకటరమణ పట్టుకోగా అమరాధి స్వామి రాయితో ముఖంపై కొట్టి గాయపర్చినట్లు బాధితుడు తెలిపారు. గాయపడిన విశ్వనాథ్ చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ మేరకు ఎంఎల్‌సీ కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.



గాయపడిన అమరాధి కాశీవిశ్వనాథ్

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన




సర్పవరం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

కాకినాడ రూరల్: తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఏపీఎస్పీ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఓ వివాహిత, ఆమె కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. సర్పవరం జంక్షన్ వద్ద పోలీసు స్టేషన్ ఎదురుగా కాకినాడ - పిఠాపురం రోడ్డుపై సోమవారం రాత్రి బైఠాయించారు. ఆ వివరాల ప్రకారం.. కాకినాడ అర్బన్ 3వ డివిజన్ గుడారిగుంటలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ లోవరాజు కుటుంబం, బాధిత వివాహిత కుటుంబం పక్క పక్క పోర్షన్లలో ఉంటుంది. లోవరాజు బాధితురాలి భర్తకు మేనమామ వరస. బాధిత మహిళకు అన్నయ్య అవుతాడు. తన భర్త ఇంట్లో లేని సమయంలో తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు డబ్బులు ఇస్తానని, కోరిక తీర్చమని వేధింపులకు గురినట్టు ఆమె జిల్లా ఎస్పీని ఆశ్రయించంతో పాటు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో గత నెల 31న ఫిర్యాదు చేసింది. వారం రోజులు అవుతున్నా చర్యలు తీసుకోవడం లేదని, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రోడ్డుపై నిరసనకు దిగారు. భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. సీఐ పెద్దిరాజు, ఎస్సై ఏసుబాబు ఆందోళన వద్దని చెప్పినా వారు ఆగలేదు. చివరికి ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేయడంతో ఆందోళన విరమించారు. కేసు విచారణ చేపట్టి వాస్తమని తేలితే కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని సీఐ పెద్దిరాజు తెలిపారు.

మెగాస్టార్‌గా డాక్టర్ కర్రి రామారెడ్డి

- ఎన్‌పీటీఎల్ గుర్తింపు
- ఆలిండియాలో ఐఐటీ 6 కోర్సుల్లో టాపర్ ఆయనే
- 70 ఏళ్ల వయసులో 50 డిగ్రీలు పూర్తి



మెగాస్టార్‌గా డాక్టర్ కర్రి రామారెడ్డికి గుర్తింపునిస్తూ ఇచ్చిన పత్రం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇక మెగాస్టార్ డాక్టర్ కర్రి రామారెడ్డి.. ఇదేంటి మెగాస్టార్ అంటే చిరంజీవి కదా అనే సందేహం వస్తోందా..! సినిమాల్లో మెగాస్టార్ చిరంజీవి అయితే చదువులో మెగాస్టార్ డాక్టర్ కర్రి రామారెడ్డి. సరస్వతి పుత్రుడు అయిన ఆయనకు దేశవ్యాప్తంగా ఉన్న 8 ఐఐటీలు కలిపి ఏర్పాటైన ఎన్‌పీటీఎల్ సంస్థ డాక్టర్ రామారెడ్డికి మెగాస్టార్‌గా ఈ గుర్తింపునిచ్చింది. సాధారణంగా ఐఐటీలో టాపర్ నిలవడం ప్లస్- 2 విద్యార్థుల కల. దానిని సాధించడం మంచి ఘనత. అటువంటిది రామారెడ్డి ఏకంగా ఆరు ఐఐటీ కోర్సుల్లో టాపర్‌గా నిలిచారు. అగ్రశ్రేణి సాంకేతిక ఐఐటీలైన ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, కాన్పూర్, ఖరగ్‌పూర్, రూర్కీ, గౌహతి, బెంగళూరు ఐఐఎస్సీలు కలిపి ఎన్‌పీటీఎల్ (నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ద్వారా సుమారు 3,200కు పైగా కోర్సులు అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ సెమిస్టర్‌లో 735 కోర్సులు నిర్వహించగా, వాటిలో తొలిసారిగా దేశ వ్యాప్తంగా టాపర్లను గుర్తించే దిశగా మెగాస్టార్ కేటగిరీని అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ విధంగా దేశ వ్యాప్తంగా మెగాస్టార్ ఘనత అందుకున్న ముగ్గురు వ్యక్తుల్లో 70 ఏళ్ల వయసులో 11 ఎన్‌పీటీఎల్ కోర్సులకు హాజరై వాటన్నింటినీ ప్రథమంలోనే ఉత్తీర్ణత సాధించడంతో పాటు 6 కోర్సుల్లో టాపర్‌గా నిలిచారు. దీనికి గాను ఆయనకు మెగాస్టార్ గుర్తింపును ఎన్‌పీటీఎల్ నుంచి అందుకున్నారు. అంతేకాక ఆయన ఇటీవల మరో విశేష ఘట్టాన్ని అందుకున్నారు. మొత్తం 50 డిగ్రీలు, అందులో డాక్టరేట్‌లు, పీజీలు, డిప్లొమాలు, సర్టిఫికేషన్లు పూర్తి చేశారు.

ప్రమాదంలో ఎంపీటీసీ సభ్యుడి మృతి



అయినవిల్లి: మండలంలోని క్రాప, శంకరాయగూడెం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామ్మూర్తి (70) ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం శంకరాయగూడెంలో తన ఇంటి నుంచి శ్రీరామ్మూర్తి మోటార్ సైకిల్‌పై ముమ్మిడివరం బయలుదేరారు.మార్గ మధ్యంలో బీపీ పెరగడంతో పక్కనే ఉన్న తాటిచెట్టును ఢీకొని కింద పడిపోయారు. స్థానికులు అయన్ని అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడన్నారు. ఆయన భౌతిక కాయాన్ని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టపర్తి వెంకటరమణ, శంకరాయగూడెం సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు తదితరులు సందర్శించి సంతాపం తెలిపారు.